

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఖమ్మం | 37.0 | 28.0 |
| భద్రాద్రి | 40.0 | 24.0 |



# పోలింగ్.. మాకే అనుకూలం

- లోక్‌సభ ఎన్నికల ఓటింగ్‌పై పార్టీల విశ్లేషణలు
- ఎవరికి వారు తమదే విజయమని ధీమా
- ఏపీ ఎన్నికల ఫలితాలపైనా జోరుగా చర్చలు
- కొన్నిచోట్ల గెలుపు, మెజారిటీలపై బెట్టింగ్‌లు

ఖమ్మం, మే 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్‌పై ఎన్నికల అధికారులు పూర్తిస్థాయి సమాచారాన్ని వెల్లడించడంతో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎవరి స్థాయిలో వారు విశ్లేషణలు సాగిస్తున్నారు. ఇటు ఖమ్మం, అటు మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పై చర్చోపచర్చలు సాగిస్తున్నారు. ఎవరికివారు ఫలితాలు తమకే అనుకూలంగా ఉంటాయని వాదిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కొంత వ్యతిరేకత ఉందని బీఆర్‌ఎస్ చెబుతుండగా, అసలు బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకుకే గండి పడిందని, బీజేపీ పుంజుకుందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్ని ఎంపీ సీట్లు వస్తాయన్న దానిపై చర్చలు సాగిస్తూనే, ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళిపై కూడా ఆరా తీస్తున్నారు. ఏపీలో ఎవరి గెలుస్తారనే దానిపై బెట్టింగ్‌లు కూడా సాగుతున్నాయి. రాష్ట్రంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చే మెజారిటీలపై కూడా కొందరు బెట్టింగ్ కాస్తున్నట్టు తెలుస్తోంది.

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం 16,31,039 ఓట్లు ఉండగా 12,41,135 ఓట్లు పోలయ్యాయి. 76.09శాతం పోలింగ్ నమోదైంది. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో 71.85శాతం పోలింగ్ జరిగింది. ఇక్కడ మొత్తం 15,32,366 మంది ఓటర్లకుగాను 11,01,030 ఓట్లు వినియోగించుకున్నారు. గత అసెంబ్లీ కంటే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గినా ఎవరికి వారు మెజారిటీలు, గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం, మహబూబాబాద్‌లో మూడు లక్షల మెజారిటీ తెచ్చుకుంటామని కాంగ్రెస్ నేతలు ధీమాతో ఉన్నారు. పోలింగ్ సరళిని బట్టి కాంగ్రెస్ నేతలు తమకు ఖమ్మంలో 57శాతం పైగా ఓటుబ్యాంకు లభించే అవకాశం ఉందని, 7లక్షల వరకు ఓట్లు వచ్చే అవకాశం ఉందని, మహబూబాబాద్‌లోనూ 57శాతం ఓటు బ్యాంకు లభించే అవకాశం ఉందని, ఆరున్నర లక్షల వరకు ఓట్లు కాంగ్రెస్ పార్టీకి పడే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ఖమ్మంలో బీఆర్‌ఎస్‌కు 32శాతం వరకు ఓట్లు వచ్చి ఉండవచ్చని, మహబూబాబాద్‌లో 27శాతం ఓట్లు పొంది ఉండవచ్చని తమ అంతర్గత లెక్కల్లో తేలిందని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. బీజేపీకి ఖమ్మంలో 10శాతం, మహబూబాబాద్‌లో 13శాతం వరకు ఓట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బీఆర్‌ఎస్ ఓటుబ్యాంకు చాలావరకు బీజేపీకి క్రాస్ అయి ఉంటుందని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు.

అయితే బీఆర్‌ఎస్ నేతలు మాత్రం... ఖమ్మం, మహబూబాబాద్‌లో తమదే గెలుపని, కొద్ది మెజారిటీతోనైనా గెలిచి తీరుతామని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వల్ల ఆ పార్టీ అనుకున్న విధంగా ఓటింగ్ వేయలేదని, నిశ్శబ్ద ఓటింగ్ జరిగిందని, కేసీఆర్ పర్యటన ప్రభావం తమకు అనుకూలించిందని గులాబీ నేతలు భావిస్తున్నారు. బీజేపీ విషయానికి వస్తే మోదీ ప్రభావం ఈ ఎన్నికల్లో తమకు లాభించనుందని, తమకు కూడా గెలుపు అవకాశాలు ఉన్నాయని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. ఇలా అన్ని పార్టీల నుంచి గెలుపు మాటే వినిపిస్తోంది. ఇక ఇక్కడి లోక్‌సభ ఎన్నికల కంటే పొరుగున ఏపీ అసెంబ్లీ లోక్‌సభ ఎన్నికలపై జిల్లావాసులు, రాజకీయ పార్టీల్లో ఎక్కువ ఉత్కంఠ కనిపిస్తోంది. ఎక్కడ నలుగురు కలిసినా ఆంధ్రా రాజకీయాలపైనే చర్చ జరుగుతోంది. అయితే అందరి ప్రశ్నలకు జూన్ 4న సమాధానం లభించనుంది.



స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన కలెక్టర్



లింకెనాల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

## సీతారామ లింక్ కెనాల్ పనులు త్వరగా పూర్తిచేయాలి

- ఇకపై ప్రతివారం పనులను పరిశీలిస్తా..
- ఆగస్టులో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఏన్కూరు వద్ద ప్రాజెక్టు లింక్ కెనాల్ పనుల పరిశీలన

7



## డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల కన్నుమూత

ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్ర మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత రాయల వెంకటశేషగిరిరావు (69) అనారోగ్యంతో బుధవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కన్నుమూశారు. శేషగిరిరావుకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన రాయల.. లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ నెలరోజులుగా హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి
- టీడీపీతో సుదీర్ఘ అనుబంధం.. 2018 నుంచి బీఆర్‌ఎస్‌లో...
- పలువురు రాజకీయ ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు
- నివాళులర్పించిన బీఆర్‌ఎస్ నేతలు

తల్లాడ, మే 15: రాయల వెంకట శేషగిరిరావుకు టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తోపాటు మాజీ సీఎంలు చంద్రబాబునాయుడు, కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిలతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్లుగా పనిచేసిన సుర్జిత్ సింగ్ బర్నాల, సుశీల్‌కుమార్ షిండే, ఈఎస్ఎల్ నరసింహన్‌లతోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. 2020లో తల్లాడ మండలం గంగదేవిపాడు సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన శేషగిరిరావు డీసీఎంఎస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై 2024 జనవరి 23 వరకు కొనసాగారు.

### 46 ఏళ్ల రాజకీయ ప్రస్థానం..

రాయల వెంకటశేషగిరిరావు 1978లో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1982లో ఎన్టీ రామారావు సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ తల్లాడ మండల అధ్యక్షుడిగా పనిచేస్తూ 1987లో తల్లాడ తొలి ఎంపీపీగా ఎన్నికై 1992 వరకు కొనసాగారు. ఉమ్మడి ఏపీలో 1,104మండలాల్లో సమర్థవంతమైన ఎంపీపీగా ఆయన గుర్తింపు పొందారు. ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం ఉన్న శేషగిరిరావు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నతాధికారులతో సత్సంబంధాలు కొనసాగించారు. ఎన్టీఆర్ హయాంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1995నుంచి 2003, 2013-2020, 2020-2024లో గంగదేవిపాడు సొసైటీ చైర్మన్‌గా, 2013-2020వరకు డీసీసీబీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2018లో టీడీపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు.



శేషగిరిరావు పార్థివదేహం వద్ద సండ్ర, మధు తదితరులు

### పలువురు ప్రముఖుల నివాళి

శేషగిరిరావు మృతి విషయం తెలుసుకొని హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో ఆయన పార్థివదేహాన్ని ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య. (మిగతా 7వ పేజీలో)

## ప్రజల వద్దకు పొంగులేటి

- 'పాలేరు'లో రేపటి నుంచి నాలుగు రోజులు పర్యటన
- ఒక్కోరోజు ఒక్కో మండలంలో...



కూసుమంచి, మే 15: పాలేరు నియోజకవవర్గ ప్రజలను నేరుగా కలిసి సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ప్రజలు సమస్యలతో క్యాంపు కార్యాలయానికి రాకుండా నేరుగా తెలుసుకునేందుకు ఆయా గ్రామాల్లో పర్యటించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అందులో భాగంగా 17న ఖమ్మంరూరల్, 18న నేలకొండపల్లి, 19న తిరుమలాయపాలెం, 20న కూసుమంచి మండలాల్లో పర్యటించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి తెలిపారు

### బాధితులు ఇబ్బందులు పడకుండా..

తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే బాధితులు ఇబ్బందులు పడకుండా, కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలు పరిష్కరించేందుకు మంత్రి పొంగులేటి ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిపించి, శాసన సభకు పంపించినందుకు రుణం తీర్చుకునేందుకు ప్రజల వద్దకు వెళ్లేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రధాన సమస్యలు తెలుసుకుని వీలైతే అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి ఒక్కో మండలంలో ఒక్కో రోజు పర్యటించనున్నారు.ప్రతి మండలంలో 15నుంచి 18 గ్రామాల్లో పర్యటిస్తారు. బాధితులనుంచి వినతులు స్వీకరించి సత్వర పరిష్కారం చేయనున్నారు.

## మరణంలోనూ వీడని బంధం



సూర్యనారాయణ, రుక్మిణి

- రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతుల మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- చెట్టుకు ఢీకొట్టిన అనంతరం మంటల్లో చిక్కుకున్న కారు
- మృతదేహాలను, క్షతగాత్రులను వెంటనే బయటకు తీసిన స్థానికులు



బోనకల్, మే 15: వారిద్దరిది ఒకరిని ఒకరు వదిలి ఉండలేనంత అన్యోన్య దాంపత్యం. క్రమశిక్షణతో కూడిన జీవితం.. వృద్ధాప్యంలోనూ ఎక్కడికెళ్లినా ఇద్దరూ కలిసే వెళ్లే వారు. జీవితాంతం కష్టసుఖాల్లో పాలుపంచుకొన్న వారు.. చివరికి మరణంలోనూ పాలుపంచుకున్నారు. బోనకల్ మండలం ముష్టికుంట్ల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వృద్ధ దంపతులు దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తల్లిదండ్రులిద్దరూ కుమారుడి ఇంటికి వెళ్లేక్రమంలో మార్గంమధ్యలోనే తిరిగిరాని లోకాలకు వెళ్లారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన కొత్తూరు సూర్యనారాయణ(92), రుక్మిణి(86) దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా పనిచేసిన ఆయన మధిరలో స్థిరపడ్డారు. వీరి కుమారుల్లో ఒకరు మధిరలో, మిగిలిన ఇద్దరు ఖమ్మంలో నివాసం ఉంటున్నారు. వృద్ధాప్యం రావడంతో ఆయన కోసం ప్రత్యేకంగా కేర్‌టేకర్‌ను కేటాయించారు. మధిరలో చిన్న కుమారుడి ఇంటినుంచి మనవడు అనిల్ ఖమ్మంలో ఉన్న తమ ఇంటికి తాతయ్య, నాయనమ్మ, కేర్‌టేకర్ నాగరాజుతో కలిసి కారులో బయలు దేరారు. ఈ క్రమంలో ముష్టికుంట్ల గ్రామ సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. ఈ సంఘటనలో దంపతులు ఇద్దరూ అక్కడిక్కడే మృతి చెందారు. అనిల్, కేర్‌టేకర్ నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరినీ 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారు చెట్టుకు ఢీకొట్టిన వెంటనే పెట్రోలు పైపు పగలడంతో మంటలు వ్యాపించాయి. ప్రమాద స్థలానికి దగ్గరలో ఉన్న వారు కారులోని దంపతుల మృతదేహాలను బయటకు తీశారు. మరో ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. కారులో చెలరేగిన మంటలు పొలాల వద్ద ఉన్న చెట్లకు వ్యాపించడంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. అగ్ని ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని సీఐ మధు, ఎస్ఐ మధుబాబు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నోట్లు రాల్చిన ఓట్ల పండుగ

**ఆరు రోజుల్లో ఆర్టీసీకి 7.63 కోట్ల ఆదాయం**

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 15: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆర్టీసీకి ఈ నెల 9నుంచి 14వ తేదీ వరకు 6రోజుల్లో 7.63 కోట్ల ఆదాయం లభించిందని ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి తమ సొంత ప్రాంతాలకు ఓటర్లను తరలించడంలో భాగంగా ఈ ఆదాయం లభించిందని తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 6 రోజుల్లో 519 బస్సుల ద్వారా 12.34 లక్షల కిలోమీటర్ల మేర బస్సులను నడిపినట్టు తెలిపారు. ఎన్నికల్లో ఓటర్ల రద్దీని ముందుగానే ఊహించి, అందుకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేసుకుని, అధికారులు, సూపర్‌వైజర్లు కండక్టర్, డ్రైవర్లను సమన్వయం చేసుకోవడం ద్వారా అధిక ఆదాయాన్ని సాధించినట్టు చెప్పారు. రీజియన్ పరిధిలో అత్యధిక ఆక్యుపెన్సీని కొత్తగూడెం (106 శాతం), ఖమ్మం (99 శాతం) డిపోలు నమోదు చేశాయని తెలిపారు. ఖమ్మం నుంచి 133బస్సుల్లో రూ.2 కోట్ల 12లక్షలు, మధిర 60 బస్సుల ద్వారా రూ.81లక్షల 50వేలు, సత్తుపల్లి 97బస్సుల ద్వారా రూ.కోటి 36లక్షల 47వేలు, భద్రాచలం 87బస్సుల ద్వారా రూ.కోటి 37లక్షల 82వేలు, కొత్తగూడెం 60 బస్సుల ద్వారా రూ.88లక్షలు, మణుగూరు 64 బస్సుల ద్వారా రూ.96 లక్షల 74 వేలు, ఇల్లెందు 18 బస్సుల ద్వారా రూ.22లక్షల 83 వేల ఆదాయం సమకూరిందని తెలిపారు.

# ఎవరి లెక్కలు వారివి!

## పోలింగ్ సరళిపై అంచనాల్లో రాజకీయ పార్టీలు

- భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్‌లో 69.02శాతం పోలింగ్
- 2019 కంటే 5 శాతానికి పైగా పెరిగిన ఓటింగ్
- వాజేడులో అత్యధికం.. భద్రాద్రిలో అత్యల్పం
- తమకే అనుకూలమంటూ నాయకుల విశ్లేషణలు



భద్రాచలం, మే 15: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయనే విశ్లేషనల్లో రాజకీయ పార్టీలు బిజీబిజీగా ఉన్నాయి. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం 1,52,683ఓట్లకు గాను 1,05,383 ఓట్లు పోలయ్యాయి. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో 64.43 శాతం ఓట్లు నమోదు కాగా ఈసారి 69.02 శాతం నమోదయ్యాయి. 13న జరిగిన ఎన్నికల్లో వాజేడు మండలంలో 14,987 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, వెంకటాపురం మండలంలో 18,993 ఓట్లు, చర్ల మండలంలో 23,713 ఓట్లు, దుమ్ముగూడెంలో 27,495, భద్రాచలంలో 20,190 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన పోరిక బలరాంనాయక్, బీజేపీ నుంచి పోటీ చేసిన అజ్మీర సీతారాంనాయక్, బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితలు ఎవరికి వారు తమకే ఆదిక్యం భద్రాద్రి నియోజకవర్గంలో దక్కుతుందనే ధీమాతో ఉన్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఏ పార్టీ అభ్యర్థి ఎంత ప్రభావం చూపారన్నది ఇప్పటికే ఈవీఎంలలో నిక్షిప్తం కావడంతో ఎన్నికల లెక్కింపు రోజున దీనిపై వాస్తవ పరిస్థితి తెలిసే అవకాశం ఉంది. భద్రాద్రి నియోజకవర్గంలో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్యే పోటీ నెలకొనే అవకాశాలున్నాయని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రభుత్వ పనితీరుతో పాటు గత ప్రభుత్వ వైఫల్యాలు తాము ఆధిక్యత చాటేందుకు దోహదపడుతుందని కాంగ్రెస్ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కాగా కేసీఆర్ చరిష్మా గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో నెరవేర్చకపోవడంతో అది తమకు అనుకూలిస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు అంచనా వేస్తున్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విజయాలు, రామాలయ నిర్మాణం, మోదీ చరిష్మా తాము ఆధిక్యత చాటేందుకు మార్గాన్ని సుగమం చేస్తుందని బీజేపీ నాయకులు భరోసాతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఓట్ల లెక్కింపు రోజున దీనిపై పూర్తి స్థాయి స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

### వాజేడులో అత్యధికం.. భద్రాద్రిలో స్వల్పం

నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా మొత్తం 1,52,683 ఓట్లలో 1,05,383 ఓట్లు పోలయ్యాయి. ఇందులో అత్యధికంగా వాజేడు మండలంలో 78.67 శాతం నమోదయ్యాయి. 19,051 ఓట్లకు గాను 14,987 ఓట్లు ఇక్కడ పోలయ్యాయి. వెంకటాపురం మండలంలో 25,041 ఓట్లకు గాను 18,993 ఓట్లు(75.85 శాతం), చర్లలో 32,079 ఓట్లకు గాను 23,718(73.94 శాతం) ఓట్లు, దుమ్ముగూడెంలో 36,065 ఓట్లకు గాను 27,495 ఓట్లు(76.24 శాతం) నమోదయ్యాయి. అయితే నియోజకవర్గంలో అత్యధిక ఓట్లున్న భద్రాచలం మండలంలో 40,447 ఓట్లకు గాను 20,190 ఓట్లు మాత్రమే పోలవడం గమనార్హం. ఇక్కడ 49.92 శాతం ఓట్లు నమోదయ్యాయి.

### ఐదు శాతానికి పైగా పెరిగిన ఓటింగ్

2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్‌లో 64.43శాతం పోలింగ్ నమోదైంది. ఆనాడు మొత్తం 1,45,509 మంది ఓటర్లుండగా 93,746 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసారి 1,52,683 ఓట్లుండగా 1,05,383 ఓట్లు అంటే 69.02 శాతం పోలింగ్ నమోదైంది. ఇదిలా ఉండగా నియోజకవర్గ కేంద్రమైన భద్రాచలం మండలంలో గతంలో 48.60 శాతం నమోదు కాగా ఈసారి 49.92 శాతంతో స్వల్పంగా పెరిగింది. ఏజెన్సీలోని మారుమలూ గ్రామీణ ప్రాంతాల్లో పోలింగు శాతం భారీగా నమోదు అవుతుండగా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన భద్రాచలంలో 50 శాతం లోపే పోలింగ్ నమోదు కావడం గమనార్హం. పోలింగ్ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు మందకొడిగానే పోలింగ్ బూత్‌లకు వచ్చారు. ఉదయం ఎండ తీవ్రత అంతగా లేకపోయినా ఓటర్లు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఓటర్లు ఓటు హక్కును తమ బాధ్యతగా తీసుకొని పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓటు వేశారు.



# విజృంభిస్తున్న డెంగ్యూ



- మందులేదు... నివారణే ముఖ్యం
- భద్రాద్రి జిల్లాలో ఏటా పెరుగుతున్న కేసులు
- నేడు జాతీయ డెంగ్యూ నివారణ దినం

భద్రాచలం, మే 15: డెంగ్యూ జ్వరం ప్రాణాంతకమైనది.. తీవ్రమైన జ్వరం వచ్చినప్పుడు ప్లేట్‌లెట్లు (తెల్ల రక్తకణాలు) తగ్గిపోయి శరీరంలోని వివిధ అవయవాలలో తీవ్రమైన రక్తస్రావం జరగవచ్చు. ఇప్పటివరకు డెంగ్యూ వ్యాధికి మందులేదు. నివారణే ముఖ్యమంటున్నాయి వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు. భద్రాద్రి జిల్లాలో గత మూడేళ్లుగా డెంగ్యూ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రాణాపాయం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యున్ని సంప్రదించి వారు సూచించిన విధంగా చికిత్స పొందితే డెంగ్యూ బారినుంచి విముక్తి పొందవచ్చు. లేదంటే ఇబ్బంది కర పరిస్థితులు తప్పవంటున్నారు. మే 16న జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డెంగ్యూ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై కరపత్రాలు, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తోంది.

**జిల్లాలో డెంగ్యూ కేసులు ఇలా...**

| సంవత్సరం | కేసులు |
|---|---|
| 2021 | 351 |
| 2022 | 413 |
| 2023 | 317 |
| 2024 ఇప్పటివరకు | 07 |

**ఎడిస్ ఈజిప్ట్ అనే దోమకాటుతోనే......**

మైక్రోస్కోప్‌లో కూడా కనిపించని వైరస్‌తో డెంగ్యూ జ్వరం వ్యాపిస్తుంది. ఈ జ్వరం ఎడిస్ ఈజిప్ట అనే దోమ కాటు వల్ల వస్తుందని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం రావడం, కళ్ల వెనుక భాగంలో నొప్పి, ఆకలి మందగించడం, శరీరం మీద దద్దుర్లు రావడం, వికారం, వాంతులు లాంటి లక్షణాలుంటే డెంగ్యూ జ్వరం వచ్చినట్లేనని వైద్యులు నిర్ధారిస్తున్నారు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని వారు సూచిస్తున్నారు.

**దోమల నియంత్రణకు డ్రైడే ఎంతో కీలకం**

ఇళ్లల్లో దోమల నియంత్రణకు డ్రైడే ఎంతో కీలకమని వైద్య, ఆరోగ్యశాఖ పేర్కొంటోంది. ఇంట్లో నీళ్లల్లో కూడా దోమ గుడ్లు పెడుతుందని కూలర్లు, ట్యాంకులు, మొక్కల్లో నిలిచి ఉన్న నీళ్ల లాంటి ప్రాంతాల్లో ఇవి వృద్ధి చెందుతాయి. డ్రైడే నాడు పరిశుభ్రంగా ఇంటిని, పరిసరాలను శుభ్రం చేసుకుంటే దోమల నియంత్రణ సాధ్యమవుతుందని వైద్యశాఖ పేర్కొంటోంది. ఇందుకోసం వారు ప్రత్యేక కరపత్రాన్ని రూపొందించి డెంగ్యూ వ్యాధి నివారణకు చేపడుతున్న చర్యలను వివరిస్తున్నారు.

# శభాష్ నవ్యశ్రీ



- 71సెకన్లలో 195 దేశాల పేర్లు
- చంద్రుగొండలో ఇంటర్ విద్యార్థి ప్రతిభ
- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు

చంద్రుగొండ, మే 15: భద్రాద్రి జిల్లా చంద్రుగొండకు చెందిన తేజావత్ నవ్యశ్రీ 71 సెకన్లలో 195దేశాల పేర్లు చెప్పి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్సుకు ఎంపికైంది. దామరచర్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తేజావత్ రాములు కుమార్తె నవ్యశ్రీ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. తండ్రి రాములు ప్రోత్సాహంతో కళ్లకు గంతలు కట్టుకొని వీడియో రికార్డు చేస్తూ ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో 195దేశాల పేర్లను 71సెకన్లలో చెప్పింది. రికార్డు చేసిన వీడియోను ఆమె తండ్రి రాములు ఇంటర్నేషనల్ బుక్ఆఫ్ రికార్డ్సుకు పంపగా దాన్ని పరిశీలించిన ఆ సంస్థ నవ్యశ్రీ పేరును తమ రికార్డ్సులో నమోదు చేస్తున్నట్లు సమాచారం ఇచ్చిందని తండ్రి రాములు తెలిపారు. ఈ ఘనత సాధించిన నవ్యశ్రీని పలువురు ప్రశంసించారు.

### వైరాలో అసెంబ్లీ కంటే అత్యధిక మెజార్టీపై

# కాంగ్రెస్ ధీమా



వైరా, మే 15: వైరా అసెంబ్లీ నియోజకవర్గంలో ఈనెల 13న జరిగిన ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజార్టీపై ఆశలు పెట్టుకుంది. గతేడాది నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైరా నుంచి గెలిచిన ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు వచ్చిన మెజార్టీ కంటే ఎంపీ ఎన్నికల్లో రామసహాయం రఘురాంరెడ్డికి మెజార్టీ పెరుగుతుందని కూడికలు, తీసివేతల్లో పార్టీ నాయకులు తలమునకలయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు 93,913ఓట్లు రాగా సమీప బీఆర్ఎస్ అభ్యర్థికి 60,868 ఓట్లు లభించాయి. రాందాస్‌కు 33,045ఓట్ల మెజార్టీ లభించింది. ఆ ఎన్నికల్లో 1,93,690 ఓట్లకు గానూ 1,67,389 ఓట్లు (86.70శాతం)పోలయ్యాయి. 2009 నుంచి ఇప్పటివరకు వైరా నియోజకవర్గంలో జరిగిన నాలుగు ఎన్నికల్లో నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చిన భారీ మెజార్టీ గత మూడు ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలకు రాలేదు. అయితే ఈనెల 13న జరిగిన ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మెజార్టీ పెరుగుతుందని కాంగ్రెస్ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీపీఐ ప్రత్యక్షంగా, తెలుగుదేశం పరోక్షంగా కాంగ్రెస్‌కు అండగా నిలిచాయి. సీపీఎం ఒంటరిగా బరిలో నిలిచింది. అయినప్పటికీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ తోపాటు సామాన్య ఓటర్లు కూడా భారీ మెజార్టీని కట్టబెట్టారు. 33,045 మెజార్టీని ఎవరూ కూడా అంచనా వేయలేదు. అయితే ఎంపీ ఎన్నికల్లో పరిస్థితి కొంత భిన్నంగా ఉన్నప్పటికీ వైరాలో కాంగ్రెస్ మెజార్టీ అసెంబ్లీ కంటే పెరుగుతుందనే ధీమాతో కాంగ్రెస్ శ్రేణులు ఉన్నారు. ఎంపీ ఎన్నికల్లో టీడీపీ ప్రత్యక్షంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వకపోయినప్పటికీ అత్యధిక భాగం ఆపార్టీ ఓట్లు కాంగ్రెస్‌కు బదిలీ అయ్యాయి. టీడీపీ ఓటింగ్ కొంతమేరకు బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, కూటమికి చెందిన బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుకు బదిలీ అయినట్లు చర్చ జరుగుతుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఎంపీ ఎన్నికల కంటే ముందు వైరా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కూడా బీఆర్ఎస్ నుంచి ఇబ్బడి ముబ్బడిగా కాంగ్రెస్‌లోకి చేరికలు జరిగాయి. ముఖ్యంగా కారేపల్లి మండలంలో ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచ్‌లు సహా బీఆర్ఎస్‌లోని ఒకస్థాయి నాయకత్వం కాంగ్రెస్ గూటికి చేరారు. కొణిజర్ల మండలంలో కొంత మంది కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకిస్తున్నా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు వచ్చాయి. వైరా మండలంలో రెండు,మూడు గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు జరిగాయి. గతంలో బీఆర్ఎస్‌కు అండగా నిలిచిన నాయకులు సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జూలూరుపాడ్, ఏన్కూరు మండలాల్లో కూడా కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగాయి. దానికితోడు ఎంపీ ఎన్నికల్లో సీపీఎం సంపూర్ణ మద్దతునిచ్చింది. గతంలో మాదిరిగానే సీపీఐ కూడా కాంగ్రెస్‌తోనే కలిసి ఉంది. ప్రభుత్వ అనుకూల ఓట్లతోపాటు భారీగా వచ్చిన చేరికలతో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటింగ్‌శాతం అసెంబ్లీ కంటే పెరిగిందని ఆపార్టీ నాయకులు ధీమాగా ఉన్నారు. అందువలన ఐదుమండలాల్లో కూడా అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీకి మించి ఎక్కువ మెజార్టీ లభిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### గ్రూప్1, సివిల్స్ ప్రిలిమ్స్ నమూనా పరీక్షలకు

## రిజిస్ట్రేషన్‌లు ప్రారంభం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 15: టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్‌కు 10నమూనా పరీక్షలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత బుధవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అర్హత గల అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌లను నగరంలోని బీసీస్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తామని, సివిల్స్ ప్రిలిమ్స్ ఆఫ్‌లైన్ పరీక్ష హైదరాబాద్‌లో నిర్వహిస్తారని తెలిపారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ నమూనా పరీక్షలు 18, 20, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1, 3 తేదీల్లో నిర్వహిస్తారని, సివిల్స్ నమూనా పరీక్షలు 23, 26, 28, 30, జూన్ 2, 4, 6, 8, 10, 12 తేదీల్లో నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9059793456, 9666436042, 9652161850 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

### స్పోర్ట్స్ కోర్సులలో ప్రవేశాలకు

## దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్, మే 15: కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో 2024-25 సంవత్సరానికి గాను పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశాలకు జూన్, జూలై నెలల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు www.lnip.edue.in అనే వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకోవాలని కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి మరిన్ని ఉద్యమాలు

- 19న జిల్లాకు కేరళ విద్యాశాఖ మంత్రి
- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 15: ప్రజా సమస్యలు పరిష్కారం కోసం మరిన్ని ఉద్యమాలు చేసేందుకు సీపీఎం కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలో దొంగల తిరుపతిరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. ఖమ్మం హవేలీలో పార్టీకోసం నూతనంగా నిర్మించిన అమరజీవి సత్తెనపల్లి రామకృష్ణ స్మారకభవనాన్ని 19న ప్రారంభోత్సవం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి కేరళ విద్యాశాఖమంత్రి శైలజా హాజరైతారని తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా సీపీఎం కార్యాలయం నుంచి ఖానాపురం హావేలీ వరకు కార్యకర్తలు రెడ్ షర్ట్ వలంటీర్లు కవాతు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అభ్యుదయవాదులు, సీపీఎం శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, విక్రమ్, బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, మీరా సాహెబ్, యర్రా శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

## 'ఎన్నికల విధుల్లో మృతి చెందిన శ్రీకృష్ణ కుటుంబాన్ని ఆదుకుంటాం'

చుంచుపల్లి, మే 15: అశ్వారావుపేటలో లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహిస్తూ మృతి చెందిన జడ్పీ కార్యాలయ ఉద్యోగి శ్రీకృష్ణ కుటుంబానికి అండగా ఉంటామని భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు హామీ ఇచ్చారు. ఖమ్మంలో బుధవారం నిర్వహించిన అంత్యమయాత్రలో ఆయన పాల్గొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని వసతులను తక్షణమే అందించేలా చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని కలెక్టర్‌కు నివేదిక అందించామని తెలిపారు. నివాళులర్పించిన వారిలో జడ్పీ సీఈవో ప్రసూనరాణి, డిప్యూటీ సీఈవో కె.చంద్రశేఖర్‌రావు, సూపరింటెండెంట్ జి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ కంచర్ల

### సీపీఐఎంఎల్ మాస్‌లైన్

## శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

వైరా, మే 15: వైరాలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను ఈనెల 19,20తేదీల్లో నిర్వహిస్తామని ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సీవై.పుల్లయ్య తెలిపారు. బుధవారం వైరాలో జరిగిన ఆపార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతితర్కం-భౌతికవాదం, శ్రమ-సరుకు-పెట్టుబడి, భారతదేశ చరిత్ర, పార్టీ నిర్మాణం, కార్యకర్తల కార్యకలాపాలు వంటి అంశాలపై ఈ రాజకీయ తరగతులు నిర్వహిస్తామని వీటిని జయప్రదం చేయాలని కోరారు. మండల కార్యదర్శి యలదండి బాబు, నాయకులు తడికమళ్ల సీతరాములు, బంకా మరియమ్మ, బండారు వెంకటరమణ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పుల్లయ్య

# సేంద్రియ సాగుతో లాభాలు..



ఖమ్మం వ్యవసాయం, మే15: వ్యవసాయం పూర్వం సేంద్రియ ఎరువుల ద్వారానే జరిగేది. పూర్వీకులు రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగించకుండానే పంటలు పండించేవారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార దిగుబడులు పెంచడానికి ఆధునిక వంగడాలతోపాటుగా రసాయనాల వినియోగించుకోవాల్సిన అవసరం నెలకొంది. రసాయన ఎరువులు, పురుగుల మందులు అధికంగా వాడుతూ దిగుబడులు పెంచుకోనే ప్రయత్నాలు చేస్తున్నారు.

**రసాయనాల వాడకంతో..**

సాగులో విచక్షణ రహితంగా బస్తాల కొద్ది రసాయన ఎరువులను కుమ్మరించడంతో ఆ మందులను తట్టుకోనే స్థాయి పంటల్ని ఆశించే పురుగుకు పెరుగుతుంది. రసాయన ఎరువులు, పురుగుల మందులు అధికంగా వాడకంతో వాటిని తట్టుకోనే స్థాయి పురుగులు, తెగుళ్ల కాలక్రమేనా అధికమైపోతాయి. వీటి వినియోగం అధికంగా ఉంటే సాగు ఖర్చు విపరీతంగా పెరుగుతుంది. ఆహార ఉత్పత్తు ల నాణ్యత తగ్గిపోతాయి. సరైన అవగాహన లేకుం డా రసాయనాల వాడకం వలన వాటి అవశేషాలు నీటిలో, సాగు నేలలో కలిసి కలుషితమవుతాయి.

**నష్టాలు-సూచనలు...**

మితిమీరిన రసాయనాల వాడకంతో మిత్ర కీటకాలు నశించి వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి. వ్యవసాయంలో పురుగు మందులు, రసాయనాలు లేకుండా చూసుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యవసాయ ఒప్పందాల ప్రకారం మార్కెట్‌లో పోటీకి మన ప్రాంత రైతులు నిలవాలంటే నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాలి. పంట ఉత్పత్తులు తక్కువ ధరలకు లభించేలా సాగు చేసుకోవాలి.

**సేంద్రియ విధానం...**

సాగులో లింగాకర్షన బుట్టలు వాడాలి. పరిమితులకు లోబడి బీటీ వైరస్ శిలీంధ్రాన్ని వాడాలి. గంధకం, రాగి ఉత్పత్తులు వాడవచ్చు. వృక్ష సంబంధం నూనెల్ని కొన్ని జాగ్రత్తలతో వాడాలి. వేప సంబంధిత ఉత్పత్తులు, పచ్చిరొట్ట, వర్మీ కంపోస్టు ఎరువులను వాడాలి. పంట వ్యర్థాలు, కొబ్బరి వ్యర్థా లు, షజొల్లా ఉపయోగపడేవే. పంటల నుంచి వచ్చే బూడిద, జీవన ఎరువులు, జిప్సం పంటల్లో వాడుకోవచ్చు.

**సేంద్రియ ఎరువులతోనే సాధ్యం...**

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసే దిశగ రైతులు అడుగులు వేస్తున్నారు. సేంద్రియ ఎరువులైన వానపాముల ఎరువులు, పశువుల ఎరువులు, కోళ్ల ఎరువు, పచ్చి ఆకు లు, పిండి చెక్కలు వాడాలి. నాణ్యమైన, రుచికరమైన ఉత్పత్తులను పండించి దేశానికి అందించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ శాఖ ద్వారా చిన్న, సన్నకారు రైతులకు సైతం అందుబాటులో ఉండే వర్మీ కంపోస్టు బెడ్స్ రూ.5 వేల సబ్సిడీపై రైతులు పొందవచ్చు. వ్యవసాయ శాఖ ద్వారా పచ్చి రొట్ట విత్తనాలైన జీలుగు, జనుము, పిల్లి పెసర విత్తనాలను 5 శాతం సబ్సిడీపై అందిస్తున్నారు.

### సర్కారు ఆస్పత్రిలో...

# పనిచేయని ఏసీలు

- సామర్థ్యం లేక... అధిక లోడు....!
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- వసతులు కల్పించాలని విజ్ఞప్తి




కరెంట్ సరఫరా లోవోల్టేజీని చూపిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, మే 15: ఒక వైపు నిప్పులు కురిపిస్తున్న ఎండలు.. మరో వైపు శస్త్రచికిత్సలతో పురుడు పోసుకున్న బాలింతలు... వివిధ వార్డుల్లో రోగులు మండుతున్న ఉష్ణోగ్రతలతో ఉక్కపోతతో రోగులు ఎదుర్కొంటున్న బాధలు వర్ణనాతీతం. మండుతున్న ఉష్ణోగ్రతలతో ఉక్కపోతలతో బాలింతలు,, చిన్నారులు, రోగులు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఇవి రోగుల బాధలు... ఇక ఆపరేషన్ థియేటర్లలో ఏసీలు పనిచేయక... వైరాలజీ ల్యాబుల్లో మిషన్లకు సరిపోను కరెంట్ సరఫరా కాక (లో వోల్టేజీతో) వైద్యులు, ఇతర సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇదంతా జిల్లా ఆస్పత్రికి సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం సరిపోకపోవడం... రోజురోజుకీ ఆస్పత్రి స్థాయి పెరిగిపోతుండడంతో పడకలు.. విద్యుత్ అవసరాలు పెరిగిపోతుండడం దానికి తగినట్లుగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయకపోవడతో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. దీంతో అత్యవసర విభాగాలు, వార్డుల్లో, ఆపరేషన్ థియేటర్లలోనూ, వైరాలజీ ల్యాబుల్లో ఎక్స్‌రే మిషన్లు, సీటీ స్కానింగ్ మిషన్లకు సరిపడినంత విద్యుత్ సరఫరా కాక తరచుగా మరమ్మతులకు లోనవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. ఏసీలు, ఫ్యాన్లు సరిగ్గా పనిచేయక వార్డుల్లో బాలింతలు, రోగులు నానా అవస్థలు పడుతున్నారు. అంతే కాదు అత్యంత కీలకమైన ఆపరేషన్ థియేటర్లలో, ఐసీయూలో ఏసీలు పనిచేయకపోవడంతో వైద్యులు, సర్జన్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల థియేటర్‌లో, ఐసీయూలో చికిత్స నిర్వహించాలంటే ఏసీ సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో దుర్వాసన వస్తోందని వీటి వలన థియేటర్ మొత్తాన్ని శానిటైజ్ హై జెనిక్‌గా శుభ్రం చేయాల్సి వస్తోందని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ప్రతి వారం హైజెనిక్ పేరుతో వైద్యులతో సమావేశాలు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది కనీస సదుపాయాలు కల్పించడంలో వాటిని పునరుద్ధరించడంలో శ్రద్ధ చూపడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



జిల్లా ఆస్పత్రిలో సామర్థ్యం తక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

**- 14 విభాగాలు... 14 వార్డులు**

పాత ఆస్పత్రి విభాగంలో ఆపరేషన్ థియేటర్లు, రక్తనిధి, కంటి విభాగం, వైరాలజీ విభాగం, క్యాథ్‌లాబ్, ఆర్థో, సూపరిన్‌టెండెంట్, ఐసీయూ, ఫార్మసీ ఇలా అనేక విభాగాలు ఉన్నాయి. వీటిలో కనీసం 200 వరకు ఏసీ మిషన్లు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఏసీలు పనిచేయకపోవడంతో, రోగులు, వైద్యులు సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని వార్డుల్లో ఫ్యాన్లు సక్రమంగా పనిచేయకపోవడంతో ఇంటి వద్ద నుంచి తెచ్చుకుని పెట్టుకుంటున్నారు. అయితే ఆస్పత్రి నిర్మించినప్పటి నుంచి అప్పట్లో 50 పడకల సామర్థ్యం నుంచి ప్రస్తుతం 520 పడకల సామర్థ్యానికి స్థాయి పెరిగిన ఆస్పత్రిలో ఇబ్బందులు రోజు రోజుకీ పెరిగిపోతోంది.

**- ఐసీయూలో పనిచేయని ఏసీలు**

జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఐసీయూలో ఏసీలు పనిచేయడం లేదు. 10 బెడ్లు ఉన్న ఈ ఐసీయూలో ఏసీలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఇక్కడ ఆపరేషన్ చేయించుకున్న వాళ్లు, అత్యవసర పరిస్థితిల్లో రోగులకు ఐసీయూలో ఉంచి చికిత్సలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆపరేషన్ చేయించుకున్న వారికి ఇన్ఫెక్షన్లు సోకకుండా ఈ గదిలో ఉంచి చికిత్సలు అందిస్తుంటారు. కానీ ఐసీయూలో ఏసీలు పనిచేయకపోవడంతో ఆ గది తలుపులు తీయగానే దుర్వాసన వస్తోందని పేర్కొంటున్నారు. కేవలం ఉన్న ఫ్యాన్లతోనే తప్ప ఐసీయూలో చల్లదనమే లేదని అక్కడ పనిచేస్తున్న సిబ్బందే వాపోతున్నారు. ఇక రోగుల పరిస్థితి మాత్రం ఆ దేవునిపై భారం వేయడమే తప్ప చేసేది ఏమీ లేదు. దీనికి అనుసంధానంగా కాన్సర్ రోగుల కోసం ప్రత్యేకంగా ఐదు బెడ్లతో ఐసీయూ ఏర్పాటు చేశారు. వీటిలోనూ అదే పరిస్థితి కొనసాగుతోంది.



ఐసీయూలో ఉన్న రోగులు
(ఇన్‌సెట్‌లో అలంకారప్రాయంగా ఉన్న ఏయిర్ కూలర్)

**- లోవోల్టేజీతో కాలిపోతున్న పరికరాలు**

జిల్లా జనరల్ ఆస్పత్రి స్థాయి పెరుగుతూ వచ్చింది. ఇప్పటి వరకు 520 పడకలతో కొనసాగుతోంది. ఎంసీహెచ్ ఇతర వార్డులు పెరిగిపోతున్నా అవసరాలకు తగినట్లుగా వార్డులకు ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది కానీ అలా జరగడం లేదు. దీంతో ఉన్న వాటిపైనే అధిక లోడు పడుతుండడం, వినియోగం పెరిగిపోవడంతో లోవోల్టేజి సమస్య తీవ్రంగా తలెత్తుతోంది. 240 వోల్టు రావాల్సి ఉండగా కేవలం 180 నుంచి 200 వోల్టుల సరఫరా అవుతోంది. దీంతో ఏసీలు, ఇతర మిషన్లలో సాంకేతిక లోపం తలెత్తుతోంది. తరచుగా కాలిపోతున్నాయి. దీనికి తోడు ఏసీలను సరఫరా చేసే గుత్తేదారుకు జిల్లా ఆస్పత్రి అధికారులు పెద్దమొత్తంలో బకాయిలు పేరుకుపోయినట్లు తెలిసింది. ఆబిల్లుల చెల్లింపులు చేయకపోవడంతో కాలిపోతున్న వాటికి మరమ్మత్తులు చేయక పోవడం ఈ పరిస్థితులకు కారణంగా చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఐసీయూలో, ఇతర వార్డుల్లో ఏసీలు కూలర్లు ఫాన్లు తిరిగేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

# అగ్నికి చెట్లు కావొద్దు బుగ్గి..

- పొగతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పొలాలకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని వినతి

కొణిజర్ల, మే15: కొందరు రైతులు ఇంకా మారడం లేదు. చేలల్లో చెత్తను కాల్చవద్దని సూచనలు చేస్తున్న వారు మాత్రం ఏం జరిగితే మాకేంటి అన్నట్లు చేలల్లో చెత్తకు నిప్పు పెడుతూనే ఉన్నారు. దాని పర్యావసనంగా చెత్తకాలుకుంటూ ప్రధాన రహదారులపై ఉన్న పచ్చని చెట్లు ఆ మంటలకు బుగ్గిపాలు అవుతున్నాయి. అంతేకాదు రోడ్డు పై వాహనదారులు ఆ మంటలతో పొగవిపరీతంగా రావడంతో కళ్లుమండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు చెత్తను కాల్చేపద్ధతి ఉంటుందని, నిప్పు పెట్టి నిర్లక్ష్యంగా వదిలివెళ్లడంతో ఏ ప్రమాదాలు జరుగుతుయోనని ఆలోచించడంలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. పచ్చదనాన్ని ఇచ్చే రోడ్డు పక్కన చెట్లు ఆ మంటలకు కాలి బూడిదవుతున్నాయి. రోడ్డు పక్కన అంతగా మంటలు వస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వైరా నుంచి మొదలుకొని కలెక్టరేట్ సమీపం వివిపాలెం వరకు రోడ్డుప్రక్కన మంటలు పెడుతూనే ఉన్నారు. అసలే గాలులురావడంతో ఆ మంటలు ఎటుపోతాయోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పొలాల్లో చెత్తకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



మంటలకు కాలిపోతున్న రహదారులపై ఉన్న చెట్లు

## డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల కన్నుమూత

(5వ పేజీ తరువాయి)


మాజీ గవర్నర్ ఎస్ఎస్.బర్నాలతో శేషగిరిరావు(ఫైల్)

జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, కొండబాల కోటేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. శేషగిరిరావు మృతి పట్ల మాజీ సీఎం కేసీఆర్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, జడ్పీటీసీ దిరిశాల ప్రమీల, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్ తదితరులు సంతాపం తెలిపారు.

ఎంపీ నామా మాట్లాడుతూ 'రాయల శేషగిరిరావుతో నాకు 20ఏళ్ల అనుబంధముంది. ఆయన రాజకీయ సేవలు ప్రశంసనీయమైనవి. రైతాంగ సమస్యల పరిష్కారంకోసం శేషగిరిరావు ఎంతో కృషి చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా..' అని పేర్కొన్నారు. అలాగే మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ 'రాజకీయంగా శేషగిరిరావు సేవలు ప్రశంసనీయమైనవి. ఆయనతో నాకు సన్నిహిత సంబంధముంది. ఆయన మృతి ఎంతో బాధాకరం. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా..' అని పేర్కొన్నారు. కాగా, రాయల శేషగిరిరావు భౌతికకాయాన్ని బుధవారం రాత్రి ఆయన స్వగ్రామం మిట్టపల్లికి తీసుకువచ్చారు. గురువారం మధ్యాహ్నం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

## సీతారామ లింక్ కెనాల్

# పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఇకపై ప్రతివారం పనులను పరిశీలిస్తా..
- ఆగస్టులో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఏన్కూరు వద్ద ప్రాజెక్టు లింక్ కెనాల్ పనుల పరిశీలన

ఏన్కూరు, మే 15: ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్ట్ ఏన్కూర్ లింక్ కెనాల్ పనులు శరవేగంగా పూర్తిచేయాలని పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏన్కూరు వద్ద సీతారామ లింక్ కెనాల్‌ను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి బుధవారం పరిశీలించారు.


మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

అనంతరం మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు నాటికి పనులు పూర్తి చేసి, సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఈ కాల్వను ప్రారంభిస్తామన్నారు. ఇకనుంచి ప్రతివారం లింక్‌కెనాల్ పనులను పరిశీలిస్తానన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు సమీపంలోని టన్నెల్ పూర్తయి, పాలేరు రిజర్వాయర్‌లో కలిపితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10లక్షల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని తెలిపారు. త్వరలోనే సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని తద్వారా తన జీవిత ఆశయం నెరవేరుతుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి భూములు ఇచ్చి సహకరించిన రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మెయిన్ కెనాల్ పనులు నాలుగు పంపుహౌస్‌లతో పాటు దాదాపుగా అన్ని పనులు పూర్తయ్యాయని, పంపుహౌస్‌ల ద్వారా లింక్ కాలువలను సాగర్ కెనాల్‌తో కలిపి రైతులకు నీరు అందించడమే మొదటి ప్రతిపాదన అన్నారు. ఈ ప్రతిపాదన ద్వారా నాగార్జునసాగర్ కాలువలో కలిపే ఏన్కూరు లింకుకెనాల్ పూర్తయితే ఈ ఏడాదే వైరా ప్రాజెక్టు కింద భూములకు గోదావరి జలాలు అందుతాయన్నారు. అదేవిధంగా వైరా ప్రాజెక్టు కింద తాగునీటి కొరత లేకుండా పోతుందన్నారు. 30 నుంచి 40వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. సాగర్ జలాలు రాకపోయినా వైరా, మధిర నియోజకవర్గాలతోపాటు సత్తుపల్లి లంకాసాగర్ ప్రాజెక్టుకు నీళ్ల తీసుకెళ్లే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కాంగ్రెస్‌పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు, తుమ్మల ముఖ్య అనుచరుడు గుత్తా వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కనకయ్యకు మంత్రి తుమ్మల పరామర్శ


కోరం పుల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

టేకులపల్లి, మే 15: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రి కోరం పుల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం మండలంలోని కోయగూడెంలో నిర్వహించిన పుల్లయ్య దశదినకర్మలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం, వైరా, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మాలోతు రాందాసునాయక్, భూక్యా మురళినాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాష, నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిన్నారెడ్డి భరత్‌చంద్రారెడ్డి, వివిధపార్టీల నాయకులు హాజరయ్యారు.

## రాష్ట్ర బాల పురస్కార్ అవార్డుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 15: సాహసాన్ని ప్రదర్శించి ఆపదలో ఉన్న బాలబాలికలను రక్షించిన బాలలు, స్వచ్ఛంద సంస్థలకు జిల్లా మహిళా, శిశు, వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ 2024-25 సంవత్సరానికి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రామ్‌గోపాల్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన ఆవిష్కరణ అసాధారణ ప్రతిభాపాటలు, ఆటలు, కళలు, సాహిత్యం, సామజిక సేవ, ధైర్యసాహస కార్యక్రమాలు తదితర అంశాలలో అవార్డులను అందజేయబడుతుందని తెలిపారు. ఈ అవార్డుల కోసం బాలలు 5 ఏళ్ల ఆపైబడి 18 ఏళ్ల లోపు ఉన్న బాలబాలికలు (31 జూలై 2024 లోపు ) ఉండాలి.

అవార్డును పొందేందుకు స్వచ్ఛంద సంస్థలు ఏడేళ్ల ఆపైన బాలబాలికల కోసం కృషి చేసి, వారి జీవితాల్లోకి మార్పుచెందినవై ఉండాలి. అరు లైన బాలబాలికలు, స్వచ్ఛంద సంస్థలు ఆన్‌లైన్లో హెచ్‌టిటిపిఎస్:అవార్డ్స్.గౌట్.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 31 జులై 2024 లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు కాపీ ఒకటి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం (కొత్త కలెక్టరేట్) నందు అందించాలని తెలిపారు.

## కారును ఢీకొన్న లారీ


దెబ్బతిన్న కారు వెనుకబాగం

సత్తుపల్లిరూరల్, మే15: జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంతో పాటు కారును కంటెయినర్ లారీ ఢీకొన్న సంఘటన సత్తుపల్లి పట్టణంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సత్తుపల్లి పట్టణానికి చెందిన మిద్దె దయాకర్, బూరుగు జ్ఞానసాగర్ లు బేతుపల్లి గ్రామానికి కారులో వెళ్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్తున్న వీఆర్ఎల్ కంపనీకి చెందిన కంటెయినర్ లారీ చింతలపూడికి బైక్‌పై వెళ్తున్న ఓ భార్యభర్తలు, పిల్లలను పట్టణ శివారులోని ఫ్లైఓవర్ వద్ద ఢీకొన్నాడు. అదేవేగంతో కారును సైతం హిందూ శ్మశానవాటిక వద్ద ఢీకొని రోడ్డు పక్కకు లారీని డ్రైవర్ ఆపాడు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు. అయితే కారు వెనుక భాగం పూర్తిగా దెబ్బతినగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్‌తో పాటు లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## మనిషి కాదు మొడు బారిన చెట్టు

- రోడ్డు ప్రక్కన ఆకర్షిస్తున్న ఎండిపోయి మొడుబారిన చెట్టు



కొణిజర్ల,మే15: ఓ మనిషిని పోలిన విధంగా ఎందరినో తన వైపు చూసే విధంగా ఓ మొడుబారిన చెట్టు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అక్కడ వరకు వచ్చిన ప్రతి వ్యక్తి ఆ వైపు చూడాల్సిందే. ఆ విధంగా ప్రకృతి దృశ్యాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. కొణిజర్ల మండలంలోని పల్లిపాడు నుంచి ఏన్కూర్ వెళ్లు రహదారి మధ్య లాలాపురం సమీపంలో రోడ్డుప్రక్కన ఎండిపోయి ఉన్న ఓ మొండిబారిన చెట్టు ఉంది. చూపరులను ఆకర్షించే విధంగా కళాకారుడు తన కుంచే నుంచి జారివాలేవిధంగా తయారు చేసినట్లు ఓ మనిషి పోలిఉండి ఎంతోగానో ఆకట్టుకుంది. ఆ దృశ్యాన్ని క్లిక్‌మనిపించడం జరిగింది.

## స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలి

● కలెక్టర్ గౌతమ్


స్ట్రాంగ్ రూంల వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసాంస్కృతికం, మే15: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ బుధవారం పరిశీలించారు. రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించటంతోపాటు భద్రతను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూంల వద్ద 24గంటలు లైట్లు ఆన్‌లో ఉంచాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ఎంట్రీ పాస్ ఉన్న అభ్యర్థుల ఏజెంట్లనే అనుమతించాలని ఆదేశించారు. సీసీ కెమెరాలకోసం ఏర్పాటు చేసిన ఎల్ ఈడీ తెరలను పరిశీలించారు. విధుల్లో ఉన్న సాయుధ బలగాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ రూంల ఏర్పాటు పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ పి.మౌనిక, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అదనపు డీసీపీ ప్రసాదరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్యామ్ ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాంబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికపై కేటీఆర్ సమావేశం

- హాజరైన ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలు


కేటీఆర్‌తో సమవేశానికి హాజరైన నామా, వద్దిరాజు, అజయ్‌కుమార్, తాతా మధు తదితరులు

ఖమ్మం, మే 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఈనెల 27న జరగబోతున్న నేపథ్యంలో హైదరాబాదులో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం జరిగింది. మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఎ.రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లా నేతలు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఖమ్మం జిల్లా నుంచి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, గుండాల కృష్ణ, ఉప్పల వెంకటరమణ, దిండిగాల రాజేందర్ తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికలో అభ్యర్థి రాకేష్‌రెడ్డికి విజయం చేకూర్చేలా పనిచేస్తామని నేతలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఆరోగ్యం క్షీణించిందని వ్యక్తి ఆత్మహత్య


శ్రీను మృతదేహం

రఘునాథపాలెం, మే 15: ఆరోగ్యం క్షీణించిందని మానసికక్షోభతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రఘునాథపాలెం మండలంలో చోటు చేసుకొంది. పరికలబోడు తండాకు చెందిన బానోత్ శ్రీను(60) కుటుంబంలో వివాదాలు చోటు చేసుకొవడంతో 17ఏళ్ల క్రితం భార్య విడిపోయింది. మూడేళ్ల క్రితం కుమారుడు కూడా మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రుల వద్ద ఉంటూ సుతా రి పనిచేస్తున్న అతడు మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల ఆరోగ్యం కూడా క్షీణించడంతో మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

## మహిళ మెడలో గొలుసు చోరీ

● చెన్నారం గ్రామంలో ఘటన

నేలకొండపల్లి, మే15: మహిళ మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లిన ఘటన మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారం గ్రామానికి చెందిన అర్వపల్లి రాజ్యలక్ష్మి(రాజమ్మ) గ్రామంలో బెల్టుషాపును నిర్వహిస్తున్నది. రెండు రోజులుగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బెల్టుషాపు వద్దకు వచ్చి మందు సేవిస్తూ ఆమెను గమనిస్తూ ఉన్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు మందు సేవిస్తూ గమనిస్తుండటాన్ని గమనించిన ఆమె ఇంట్లోకి వెళ్లి స్నానం చేసి బయటకు వస్తుండగా, ఇద్దరు వ్యక్తులు ఆమెపై పడి మెడలో ఉన్న దాదాపు నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. దొంగలు పారిపోయాక తేరుకున్న ఆమె కేకలు వేయడంతో గ్రామస్థులు గుమ్మిగూడారు. గ్రామస్థులు అన్ని వైపులా గాలించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఈ విషయమై బాధితురాలు నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## సెల్‌టవర్‌లో జనరేటర్ చోరీ


జనరేటర్ చోరీ జరిగిన సెల్‌టవర్

నేలకొండపల్లి, మే15: మండల కేంద్రంలోని సాయిబాలాజీ థియేటర్ పక్కన ఉన్న ఎయిర్‌టెల్ సెల్‌టవర్‌లో చోరీ జరిగింది. వివరాల ప్రకారం.. ఎయిర్‌టెల్ సెల్‌టవర్‌లోని బుధవారం సెల్‌టవర్ గది తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన టెక్నీషియన్ లోనికి వెళ్లి చూడగా జనరేటర్ లేకపోడాన్ని గమనించి పై అధికారులకు ఫిర్యాదు చేశాడు. టవర్‌కు సంబంధించిన అధికారులు వచ్చి పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనరేటర్ విలువ సుమారు 70 వేలు ఉంటుందని సమాచారం.

## పాత కొత్తగూడెంలో రెండు తులాల బంగారం..

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే15: పాత కొత్తగూడెం ప్రాంతంలోని సింగరేణి క్వార్టర్స్‌లో నివసిస్తున్న ప్రభుత్వ ఉద్యోగి కుటుంబరావు ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కొత్తగూడెం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్ఐ విజయకుమారి క్లూస్ టీమ్‌తో సంఘటన స్థలం వద్ద వివరాలు సేకరించారు. రెండు తులాల బంగారం అపహరణకు గురైందని నిర్ధారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సన్నాహాలు

- అభ్యర్థుల ప్రచారానికి పది రోజులే గడువు
- 27న పోలింగ్
- జూన్ 5న కౌంటింగ్
- మూడు ఉమ్మడి జిల్లాలో 4,63,839మంది ఓటర్లు

నల్లగొండ, మే 15: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తుంది. ఓ వైపు అధికారులు ఎన్నిక ప్రక్రియలో నిమగ్నం కాగా ప్రధాన పార్టీలు అయిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారాన్ని మొదలు పెట్టగా ఆయా పార్టీల అధిష్టానాలు సైతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై దృష్టిసారించి తమ సత్తా చాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఇక అభ్యర్థుల ప్రచారానికి కేవలం 10రోజులే గడువు ఉంది. ఈనెల 25వ తేదీన 5గంటలకు ప్రచారం ముగించాల్సి ఉంటుంది. ఇక 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదేవిధంగా ఉప ఎన్నిక కౌంటింగ్ జూన్ 5వ తేదీన నిర్వహించనున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నిక ఉమ్మడి వరంగల్ - ఖమ్మం - నల్లగొండ జిల్లాల పరిధిలోని 12 జిల్లాకు విస్తరించి ఉండటంతో ఈ ఎన్నికపై సర్వత్రా నెలకొంది. మూడు జిల్లాలకు రిటర్నింగ్ అధికారిగా నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి వ్యవహరించనుండగా ఆయా జిల్లాలకు సంబంధించిన అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు డివిజన్లు వారీగా ఏఆర్‌వోలుగా వ్యవహరించనున్నారు. అదేవిధంగా 12జిల్లాల్లో మొత్తం 605 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం 4,63,839మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. వీరంతా ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### అభ్యర్థులు ప్రచారాలకు అనుమతి తీసుకోవాలి: ఆర్‌వో హరిచందన

పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ పరిధి మూడు ఉమ్మడి జిల్లాలోని 12 జిల్లాలో ఉంది. 12మంది అదనపు కలెక్టర్లు ఏఆర్‌వోలుగా ఉన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారం చేసుకోవచ్చు. దానికి సంబంధించిన అనుమతులు జిల్లా స్థాయిలో నైతే ఏఆర్‌వోల వద్ద మొత్తం నియోజకవర్గం అయితే నల్లగొండ జిల్లాలోని ఆర్‌వో కార్యాలయంలో అనుమతి తీసుకోవాలి. ఎన్నికల ప్రవర్తన నియామవళి పార్లమెంటు ఎన్నికల లాగానే ఉంటుంది. ఈనెల 27న పోలింగ్ జరగనుంది. నియోజకవర్గ పరిధిలోని 12 జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. అక్కడ నుంచే బ్యాలెట్ పత్రాల పంపిణీ ఉంటుంది. పోలింగ్ అనంతరం 12 జిల్లాలకు చెందిన బ్యాలెట్ బాక్సులు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు తరలిస్తాం. జూన్ 5వ తేదీన కౌంటింగ్ నిర్వహిస్తాం.

జిల్లాల వారీగా పట్టభద్రుల ఓటర్ల వివరాలు.....

| క్రసం. | జిల్లా పేరు | పురుషులు | స్త్రీలు | థర్డ్‌జెండర్‌లు | మొత్తం |
|---|---|---|---|---|---|
| 1. | సిద్ధిపేట | 3122 | 1557 | 0 | 4679 |
| 2. | జనగాం | 14915 | 8503 | 1 | 23419 |
| 3. | హన్మకొండ | 25739 | 17990 | 0 | 43729 |
| 4. | వరంగల్ | 27038 | 16774 | 0 | 43812 |
| 5. | మహబుబాబాద్ | 22948 | 11985 | 0 | 34933 |
| 6. | ములుగు | 6587 | 3719 | 0 | 10299 |
| 7. | జయశంకర్‌భూపాలపల్లి | 8000 | 4535 | 0 | 12535 |
| 8. | కొత్తగూడెంభద్రాద్రి | 22590 | 17516 | 0 | 40106 |
| 9. | ఖమ్మం | 50676 | 33199 | 4 | 83879 |
| 10. | యాద్రాద్రిభువనగిరి | 20838 | 13242 | 0 | 34080 |
| 11 | సూర్యాపేట | 34176 | 17321 | 0 | 51497 |
| 12 | నల్లగొండ | 51560 | 29311 | 0 | 80871 |
| | మొత్తం | 288189 | 175645 | 5 | 463839 |

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో అభ్యర్థులు వీరే..

| క్రసం. | అభ్యర్థి పేరు | పార్టీ |
|---|---|---|
| 1. | గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి | బీజేపీ |
| 2. | తీన్మార్ మల్లన్న | కాంగ్రెస్ |
| 3. | ఏనుగుల రాకేష్ రెడ్డి | బీఆర్ఎస్ |
| 4. | కర్నె రవి | నేషనల్ నవక్రాంతి |
| 5. | గుండాల జ్యోతి | తెలంగాణ రిపబ్లికన్ పార్టీ |
| 6. | చెన్న శ్రీకాంత్ | సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా |
| 7. | జాజుల భాస్కర్ | శ్రమజీవి పార్టీ |
| 8. | జానయ్య నందిపాటి | తెలంగాణ సకల జనుల పార్టీ |
| 9. | పాటి శ్రీకాంత్‌రెడ్డి | ప్రజావాణి పార్టీ |
| 10. | పూస శ్రీనివాస్ | తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణ సమితి |
| 11. | బి.దుర్గప్రసాద్ మహరాజ్ | ధర్మసమాజ్ పార్టీ |
| 12. | ఈద శేషగిరి రావు | డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ |
| 13. | దేశగాని సాంబశివగౌడ్ | బ్లూ ఇండియా పార్టీ |
| 14. | సోదే వెంకటేశ్వర్లు | గోండువానా దండకారణ్య పార్టీ |

స్వతంత్రులు:

అనిల్ కుమార్ గాదెపాక, అంబాల రాజేష్, తేలు అన్నరవి యాదవ్, అశోక్ కుమార్ పాలకూరి, ఏఎస్.కృష్ణ, అయితగోని రాఘవేంద్ర, కంటే సాయన్న, కృష్ణంరాజు మెండెం, కోడిరెక్క ఉమాశంకర్, డాక్టర్ గడ్డం మల్లేష్, గుగులోతు బీమా, చంద్రక్రాంతి కుమార్, చాలిక చంద్రశేఖర్, చీదేళ్ల ఉమామహేశ్వరీ, చెరుకు శివకుమార్ గౌడ్, జంగ సుధాకర్, జల్లారపు రమేష్, చిల్లెపల్లి వెంకట శ్యాంప్రసాద్, తాడిశెట్టి క్రాంతికుమార్, తేజావత్ వాసుదేవ్, దయాకర్ గజ్జి, దునుకు వేలాద్రి, పడిశెట్టి రాజు, పూజారి సత్యనారాయణ, పీటం మల్లికార్జున్, డాక్టర్ పెంచల శ్రీనివాస్, బక్క జాడ్సన్, బుగ్గ శ్రీకాంత్, బుర్ర ముత్తిలింగం, భైరవబట్ల శ్రీనివాసరావు, మాదవపెద్ది వెంకట్‌రెడ్డి, మారం వెంకట్‌రెడ్డి, ముద్ర మల్లికార్జున్‌రావు, మోహన్‌రెడ్డి కొనకాల, యాతాకుల శేఖర్, రాజు నాయక్ గుగులోతు, గుగులోతు సంతోష్, సుంకరి లింగయ్య.

## వడ్డెరంగాపురంలో 20 కుటుంబాలకు సహాయ నిరాకరణ

- బొడ్రాయి ప్రతిష్ఠతకు చందాలు ఇవ్వలేదని గ్రామపెద్దల తీర్మానం
- పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు


మాట్లాడుతున్న పోలయ్య, పుష్పరాజు, వీర్రాజు

అశ్వారావుపేట, మే 15: గ్రామం సుభిక్షంగా ఉండేందుకు గ్రామ మధ్యలో బొడ్రాయి ప్రతిష్ఠించాలని గ్రామస్థులు తీసుకున్న నిర్ణయం గ్రామాన్ని విడదీసింది. కులా లు, మతాలుగా విడిపోయి సంఘటన వడ్డెరంగాపురంలో చోటు చేసుకుంది. కొద్ది రోజుల క్రితం వడ్డెరంగాపురం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠించాలని, అందుకోసం రూ.లక్షల్లో ఖర్చు అవుతుండటంతో ప్రతి ఇంటి నుంచి చందాలు ఇవ్వాలని గ్రామస్థులు తీర్మానించుకున్నారు. చందాలు వసూలు చేసే సమయంలో గ్రామంలో ఓ వర్గానికి చెందిన 19 కుటుంబాలవారు చందాలు ఇవ్వలేదు. గ్రామంలో కార్యక్రమాలకు కుల మతాలతో సంబంధం లేదని, గ్రామ సుభిక్షం కోసం చేపట్టే కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యులు కావలసిందేనని, తప్పనిసరిగా అందరూ చందాలు ఇవ్వవలసిందేనని గ్రామపెద్దలు ఖరాఖండిగా చెప్పారు. దీనికి అంగీకరించకపోవడంతో గ్రామ పెద్దల తీర్మానాన్ని వినని వారికి గ్రామస్థులు సహకరించవద్దని, కిరాణా దుకాణాలవద్ద కూడా సరుకులు ఇవ్వొద్దని, అలా ఇచ్చినవారికి జరిమానా విధిస్తామని తమకు సహాయ నిరాకరణ చేస్తూ బాధ పెడుతున్నారం టూ చల్లా దుర్గయ్య, పోలయ్య, పుష్పరాజ్, వీర్రాజు అనేవార్లు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన గ్రామం వర్గాలుగా చీలి ఘర్షణకు తావిచ్చింది. గ్రామస్థులు సహాయ నిరాకరణ చేస్తున్నారని, అవసరమైతే బహిష్కరిస్తామంటున్నారంటూ బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఈ మొత్తం వ్యవహారం వివాదాస్పదమవ్వడానికి వెనుక కొన్ని రాజకీయ కారణాలు కూడ ఉన్నాయనే ప్రచారం జరుగుతుంది.

ఎస్ఐ శ్రీనును వివరణ కోరగా సంఘటనపై ఫిర్యాదు వచ్చిందని ఇరు వర్గాలను పిలిపించి విచారించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## అకాల వర్షాలకు కూలిన ఇళ్లు

- పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

కూసుమంచి, మే 15: కూసుమంచి మండలంలో మంగళవారం సాయంత్రం అకాల వర్షం కారణంగా పలు గ్రామాల్లో గాలికి రేకు ల ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. కాగా కూసుమంచి మండల కాంగ్రెస్ నాయకులు గంగబండ తండలో పలు బాధిత కుటుంబాల ఇళ్లను పరిశీలించారు. వడిత్య సైదులు ఇంటి పైకప్పు లేచిపోయి, ఇంట్లో నిల్వ ఉన్న ధాన్యం తడిచిపోయింది. పరిశీలించిన నాయకులు విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా వడిత్య సుందర్ కుటుంబసభ్యులలో ఒకరు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయనను పరామర్శించారు.

కార్యక్రమంలో జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు మొక్క శేఖర్, మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు గురవయ్య, మైనారిటీ జిల్లా నాయకులు హఫీజుద్దీన్, మాజీ సీడీసీ చైర్మన్ జూకూరి గోపాలరావు, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సత్తుపల్లిరూరల్, మే15: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీ వ్రగాయాలైన సంఘటన సత్తుపల్లి పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానిక రాజబాపయ్య వీధి సమీపంలోని జాతీయ రహదారిపై ఎదురుగా వెళ్తున్న ఆటోను బైక్‌తో ఒకరు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై పరిస్థితి విషమంగా ఉన్న బైకిస్టును ఖమ్మం తరలించారు. కాగా ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు అందకపోవడంతో క్షతగాత్రుడి వివరాలు తెలియరాలేదు.

## ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంపై కేసు

పాల్వంచ, మే 15: పాల్వంచ మండలం కేశవాపురంలోని జాతీయరహదారిపై ఈ నెల 5న రవికుమార్ అనే లారీ డ్రైవర్ లారీని అజాగ్రత్తగా తోలుతూ డివైడర్, కరెంటు స్తంభాలను ఢీకొట్టాడు. దీంతో అవి పూర్తిగా ధ్వంసమయ్యాయి. పంచాయతీరాజ్ శాఖ ఏఈ అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు సదరు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

## 'పామాయిల్ మొక్కలను తీసుకెళ్లాలి'

అశ్వారావుపేట, మే 15: పామాయిల్ మొక్కలను 2020 నుంచి 2024 సంవత్సరం వరకు తీసుకున్న రైతులు ఆ మొక్కలు చనిపోతే వాటి స్థానంలో మరో మొక్కలు తీసెకెళ్లవచ్చని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారి బాలకృష్ణ బుధవారం ఒక ప్రకనలో తెలిపారు. మొక్కలు అవసరమైనవారు డివిజనల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. పామాయిల్ మొక్కలు ఏమైనా అవసరమైతే ఆయిల్‌ఫెడ్ ద్వారా జారీ చేయబడతాయని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

గురువారం 16 మే 2024

## చిలకలగండి చైర్మన్‌ను గిరిజనులకు కేటాయించాలి

అశ్వారావుపేట, మే 15: మండల పరిధిలోని వినాయకపురంలో వేంచేసివున్నచిలకలగండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ చైర్మన్ పదవిని గిరిజనులకు కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు పాయం దుర్గా రావు డిమాండ్ చేసారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉండి, ఆదినుండి గిరిజనుల ఆరాధ్యదైవంగా ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ ఆలయాన్ని దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకొని నిర్వహిస్తుందని, దీని నిర్వహణలో గిరిజనులకు ఎటువంటి ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. పీసీ, 1/70 చట్ట పరిధి ప్రాంతంలో ఉన్న ఈ ఆలయంను గిరిజన చట్టాల ప్రకారం గిరిజనులకు చైర్మన్ పదివిని కేటాయించాలని ఆయన కోరారు. ఈమేరకు పరిశీలించాలని ఆయన దేవాదాయ శాఖ అధికారి, ప్రభుత్వానికి లేఖ ద్వార విన్నవించారు. ప్రభుత్వం ఈ విన్నపంను పరిశీలించాలని కోరారు.

# పశువైద్యాధికారి నియామకం ఎప్పుడు..?

రోగాల బారిన పడుతున్న మూగజీవాలు

వైద్యశాలకు అటెండరే దిక్కు.. పట్టించుకోని అధికారులు

వైద్యాధికారిని నియమించాలంటున్న ప్రజలు

కరకగూడెం, మే 15: జిల్లాలో 30 పశువైద్యశాలలు ఉన్నాయి. కానీ 17 మంది వైద్యులు మాత్రమే ఉండటంతో పలు వైద్యశాలలకు ఇన్‌చార్జి వైద్యులుగా కొనసాగుతున్నారు. సుమారు 13 వైద్యశాలలకు 14 మంది వైద్యులను జిల్లా అధికారులు నియమించాల్సి ఉన్నట్లు సమాచారం. పశువులు రోగాల బారిన పడిన పూర్తి స్థాయి వైద్యులు లేక పోవడంతో మూగజీవాలు రోగాల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం మండల కేంద్రంలోని పశు వైద్యశాలకు వైద్యాధికారి లేక సుమారు మూడు సంవత్సరాలు గడుస్తున్న సంబంధిత అధికారులు పశు వైద్యాధికారి నియమించక పోవడంతో మండలంలోని పశువులు, మేకలు, గొర్లు రోగాల బారిన పడుతూ మృత్యువాత పడుతున్నాయి. పశువులకు చిన్నపాటి వ్యాధి బారిన పడితే అంతే సంగతులు. మూగజీవాలు వ్యాదుల భారిన పడి బక్కచిక్కడంతో రైతులు పశువులను వ్యాపారస్థులకు అమ్ముకుంటున్నారు. మండల కేంద్రంలోని వైద్యాశాలలో వైద్యాధికారిగా పనిచేస్తున్న వైద్యుడు ఆనారోగ్యంతో విధులకు రాకుండా మానేసీ సుమారు మూడు సంవత్సరాలు గడుస్తున్న సంబంధిత అధికారులు మాత్రం వైద్యధికారిని నియమించలేదని ప్రజలు వాపోతున్నారు. గతంలో మండలంలోని పద్మాపురం, భర్లగూడెం, చొప్పాల, చిరుమళ్ళ, కలవలనాగారం, భట్టుపల్లి, కరకగూడెం గ్రామాలలో అంతుచిక్కని వ్యాధితో మూగజీవాలు మృత్యువాత పడ్డ సంగటనలు ఉన్నాయి. ఇప్పుడు ఎండలకు వేడి నీరు తాగడంతో పశువులు దొమ్మ జబ్బులతో మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రంలో పశువైద్యాధికారిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

**ఇన్‌చార్జ్‌గా పినపాక వైద్యాధికారి**

మండల కేంద్రంలోని పశువైద్యశాలకు వైద్యాధికారి లేకపోవడంతో.. సంబంధిత అధికారులు పినపాక పశువైద్యాధికారిని కరకగూడెం వైద్యశాలకు ఇన్‌చార్జ్ వైద్యుడిగా నియమించారు. కానీ పినపాక వైద్యుడు అధ్వర్యంలో జానంపేట, పినపాక రెండు వైద్యశాలల ఉండటంతో కరకగూడెం వైద్యశాలకు వచ్చిన దాఖలాలు కరువయ్యాయి. దాంతో మండల వైద్యశాలకు అటేండర్ ఒక్కరే దిక్కయ్యాడు. మండలంలో పశువులకు చిన్నపాటి రోగాలతో ఇబ్బందులు పడితే అటేండరే ప్రథమ చికిత్స చేస్తుంటాడు. వర్షాలు పడే కాలం వస్తున్న తరుణంలో పశువులు మరింత రోగాల బారిన పడే అవకాశం ఉందని కరకగూడెం పశువైద్యశాలకు వైద్యాధికారిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



కరకగూడెం పశు వైద్యశాల

**పశువైద్యాధికారిని నియమించాలి, చందా మధు: టీడీపీ మండల ఎస్టీసెల్ రాష్ట్ర నాయకుడు**

పశువైద్యాధికారి లేక పోవడంలతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. అధికారులు స్పందించడం లేదు వర్షాలు పడుతుండటంతో కొత్త నీరు, పసిరిక గడ్డి వలనా పశువులు రోగల బారిన పడే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయి వైద్యాధికారిని నియమించాలి. ఈ విషయమై వెంటనే చర్యలు తీసుకోవాలి.

## పాఠశాలల్లో మరమ్మతుల ఫొటోలు పంపండి

స్పెషలాఫీసర్ల వీసీలో పీవో ప్రతీక్ జైన్


సమీక్ష నిర్వహిస్తున్న పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, మే 15: గిరిజన సంక్షేమ పరిషత్ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఇప్పటి వరకు మరమ్మతులు చేసిన ఫొటోలను తనకు పంపించాలని ఉమ్మడి జిల్లా స్పెషలాఫీసర్లను భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ఆదేశించారు. బుధవారం స్పెషలాఫీసర్లతో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలలో విద్యార్థులకు బెడ్లపైన పడుకునే విధంగా కాట్ కటింగ్ పనులు, మెస్ ఏర్పాటు, పరిశుభ్రత, డార్మెటరీ తరగతి గదులకు అల్ఫాబెట్ ప్రకారం నెంబర్లు వేయడం, ప్రతి నాలుగు బెడ్లకు కలిపి ఒక ఫ్యాన్ ఏర్పాటు చేయడం మొదలైన పనులు ఈ నెల 20వ తేదీ నాటికే పూర్తి చేయాలన్నారు. తాగునీరుతో పాటు స్నానాలు చేసే వాటర్ ట్యాంకు వద్ద శుభ్రంగా నీరు వెళ్లేలా, గచ్చు మంచిగా చేపించాలని తెలిపారు. ఎక్కువ డబుల్‌కాట్ మంచాలున్న బెడ్‌లను సమీపంలోని ఇతర పాఠశాలలకు తరలింఆలని ఏటీడీవోలను ఆదేశించారు. వంట షెడ్ నిర్వహణ, కరెంటు కనెక్షన్, ఫ్యాన్ల సరఫరా సక్రమంగా ఉండాలని తెలిపారు. 24న స్పెషలాఫీసర్లందరికి పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన పనులు కార్యాచరణ పరిశీలించడానికి రివ్యూ తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఏడీ అగ్రికల్చర్ బాస్కరన్, ఎఫ్‌డీసీ అశోక్, ఏసీఎంవో రమణయ్య, డీటీఆర్‌వోఏఫ్‌ఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రాయల మృతిపట్ల పలువురి సంతాపం

ఖమ్మం కార్పోరేషన్/వైరా/నేలకొండపల్లి, మే 15: ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు మృతిపట్ల డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. ఖమ్మం జిల్లా రైతులకు డీసీఎంఎస్ కు ఆయన విశేష సేవలందించారని కొత్వాల పేర్కొన్నారు. శేషగిరి రావు కుటుంబ సభ్యులకు కొత్వాల తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

వైరా: అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకటశేషగిరిరావుకు వైరా మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు(రెబ్బవరం ఎంపీటీసీ) రాయల రమేష్ సంతాపం తెలిపారు. వైరా మునిసిపల్ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, వైరా మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు తదితరులు కూడా శేషగిరిరావు మృతి పట్ల సంతాపం, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

## ఓటింగ్ సరళిపై సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న పొదెం వీరయ్య

దుమ్ముగూడెం, మే 15: మండల వ్యాప్తంగా పార్లమెంటు ఎన్నికల ఓటింగ్ సరళిపై డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య బుధవారం సమీక్ష నిర్వహించారు. నలభై బూత్‌ల్లోనూ కాంగ్రెస్‌కే మెజారిటీ ఓటర్లు పట్టం కట్టారని తెలిపారు. బలరాంనాయక్‌కు మండలం నుంచి మంచి మెజారిటీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వినీల్, ఎంపీటీసీ భీమరాజు, నాయకులు కుమారి, వెంకటేష్, శివ, సూర్యచంద్రరావు, దేవా, సుధాకర్, శేఖర్, వరలక్ష్మి, చిన్నారావు పాల్గొన్నారు.

## 150 మంది కూలీలను పనులకు రప్పించాలి

డీఆర్‌డీవో అంబుడ్స్‌మెన్ ప్రకాశ్

జూలూరుపాడు, మే 15: ప్రతి పంచాయతీ పరిధిలో ఉపాధి పనులకు 150 మంది కూలీలను పనులకు రప్పించే విధంగా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఈజీఎస్ మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీవో అంబుడ్స్‌మెన్ ప్రకాశ్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలతో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేయించాలని, వారికి రూ.300ల వేతనం వచ్చేలా చూడాలని అన్నారు. క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు పని ప్రదేశాలలో ఉండి కూలీల చేత పనులు చేయించాలని కోరారు. పని ప్రదేశాలలో కూలీలకు తాగు నీటి వసతి, నీడ సౌకర్యం కల్పించాలని అన్నారు. పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూలీలకు సౌకర్యాల కల్పనలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. వారికి అవసరమైన అన్ని మౌలిక వసతులూ కల్పించాలని ఆయన ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని కోరారు. ఈ ఈ సమావేశంలో ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఈజీఎస్ మండల ఏపీవో రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రకాశ్

## మాజీ ఎంపీపీకి మెచ్చా పరామర్శ


సత్యాన్ని పరామర్శిస్తున్న మెచ్చా

దమ్మపేట, మే 15: మాజీ ఎంపీపీ పానుగంటి సత్యాన్ని ఆయన నివాసం దమ్మపేటలో బుధవారం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవలే సత్యం అనారోగ్యానికి గురికాగా ఈ విషయం తెలుసుకున్న మెచ్చా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ నాయకుడు యార్లగడ్డ బాబు శేఖర్ ఇటీవలె జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు శేఖర్‌ను కూడా మెచ్చా పరామర్శించి త్వరితగతిన కోలుకోవాలన్నారు. అనంతరం తెలంగాణా ఉద్యమ నాయకుడు గాజుబోయిన శ్రీను మెచ్చా పరామర్శించారు. ఆరోగ్యం గురించి ఆరా తీశారు.

## రామాలయానికి వంట సామగ్రి వితరణ


సామగ్రి అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, మే 15: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంకు బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఎల్వీఎన్ మురళీధర్‌రావు, నాగమణి, ఆకుల నరసింహం, నమిత వారి కుటుంబ సభ్యులు రూ.65 వేలు విలువైన వంట సామాగ్రిని అందజేశారు. ఈ సామాగ్రిని దేవస్థానం ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవ్ చేతుల మీదుగా ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబాకు అందజేశారు.

# లయన్స్ క్లబ్ ద్వారా విస్తృత సేవ

అశ్వారావుపేట, మే 15: లయన్స్‌క్లబ్ ద్వార అంతర్జాతీయంగా విస్తృత సేవా కార్యక్రమాలను చేపట్టి ప్రశంసలందుకుంటున్నట్టు లయన్స్‌క్లబ్ జిల్లా 320ఈ పీఎంజెఎఫ్ సీహెచ్‌వి శివ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన అధికార పర్యటనలో భాగంగా అశ్వారావుపేట లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన పలు సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ చేయడం మహా భాగ్యమని, లయన్స్‌క్లబ్ ద్వార సేవ చేయడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి నొందిన తృప్తి లభిస్తుందన్నారు. ప్రతి ఏటా వందల కోట్ల రూపాయల సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం ఆయన అంకమ్మచెరువు ఆంజనేయస్వామి స్వామి వద్ద చిల్డ్రన్ పార్క్, సిమెంట్ బల్లలు, మొక్కలను వేయించారు. అమ్మసేవా సదనంలో వృద్దులకు రూ.15వేలుతో రిఫ్రిజరేటర్‌ను అందజేసారు. అన్నదానం చేసారు. వీధి వ్యాపారులకు ఐదు గొడుగులు అందజేసారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు దూబగుంట్ల దుర్గారావు, రీజియన్ చైర్‌పర్సన్ కొఠారు చలపతిరావు, జిల్లా బాధ్యులు యుఎస్ ప్రకాశారావు, కంచర్ల రామారావు, కోటగిరి సీతారామస్వామి, జల్లిపల్లి కొండ, కోటగిరి మోహనరావు, జెకెవి రమణారావు, శీమకుర్తి వెంకటేశ్వరరావు, సుబ్బారావు, సమయమంతుల మహేశ్వరరావు, జూపల్లి బ్రహ్మారావు, యువై సుబ్రహ్మణ్యేశ్వరరావు, దారా మల్లిఖార్జునరావు, అత్యం వెంకటేశ్వరరావు, చక్రధరరావు, నరేం ద్రబాబు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


శివప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## రామదాసు మృతి తీరనిలోటు

భద్రాచలం, 15: తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు కొలిశెట్టి రామదాసు మృతి తీరని లోటని తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు తిప్పన సిద్దులు అన్నారు. రామదాసు ఎంతో ఆత్మీయుడని ఉద్యమానికి నాంది పలకడంతో పాటు సింగరేణిలో పని చేసే వారికి ప్రమోషన్ల విషయంలో తెలంగాణవాసులకు అనుకూలంగా పోరాటం చేశారన్నారు. వరంగల్‌లో జరిగిన ఫైరింగ్‌లో, కొన్ని గోదాములు తగలబెట్టడం వంటి సంఘటనల్లో నేను రామదాసుతో కలిసి పాల్గొనడం జరిగిందని ఆనాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అటువంటి రామదాసు మన మధ్య లేకపోవడం చాలా విచారకరమైన విషయమని పేర్కొన్నారు.

## ఇల్లెందు ఎమ్మెల్యేకు పరామర్శ


పుల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సుజాత

అశ్వాపురం, మే 15: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత పరామర్శించారు. కనకయ్య తండ్రి పుల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం ఆయన దశదిన కర్మ సందర్భంగా ఎంపీపీ పుల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించి కనకయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, మండల కాంగ్రెస్ నాయకుడు ముత్తినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అడవుల సంరక్షణకు చర్యలు

సీసీఎఫ్ భీమా నాయక్

అశ్వారావుపేట, మే 15: అడవుల పరిరక్షణకు సిబ్బంది పటిష్ట చర్యలు చేపట్టాలని సీసీఎఫ్ భీమా నాయక్ కోరారు. బుధవారం ఆయన అయన మండలంలో అటవీ అభివృద్ధి పనులను పరిశీలించారు. వేదాంతపురం బీటు పరిధిలో వెదురు కోతపై జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. వెదురు సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం ఊట్లపల్లి పరిధిలో 50 హెక్టార్లలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రతిపాదించిన ప్రదేశాన్ని సందర్శించారు. ప్లాం టేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అశ్వారావుపేట బీట్ పరిధిలోని ప్లాంటేషన్ వేయబోయే ప్రదేశాలను ఆయన సందర్శించారు. సోలార్ బోరును పరిశీలించారు. అనంతరం ఆయన ఉద్యోగులతో మాట్లాడుతూ అడవుల పరిరక్షణ పట్ల అందరూ చిత్తశుద్ధితో ఉండాలని, కొత్త పోడులు నరకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. విధులపట్ల చిత్తశుద్ధితో ఉండాలని సూచించారు. డీఎఫ్‌వో కిష్టాగౌడ్, పాల్వంచ ఎఫ్‌డీవో దామోదరరెడ్డి, రేంజర్ మురళి పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న భీమా నాయక్

## కాంగ్రెస్ జెండా మోసినోళ్లకు ఆదరణ కరువు


సమావేశంలో మాట్లాడుతున్న జేబీ శౌరి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 15: కాంగ్రెస్ పార్టీ జెండా మోసినోళ్లకు ప్రస్తుతం గుర్తింపు కరువైందని, పోరాటాలు, కేసులు నమోదు చేసుకున్న వారి త్యాగాలను తుంగలోకి తొక్కడంతో వారికి ముప్పు పొంచి ఉందని రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్, టీపీసీసీ సభ్యుడు జెబి.శౌరీ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన వారు నేడు గుర్తింపునకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటు చేస్తూ నిరసన ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి, పోలీస్ స్టేషన్‌లో కేసులు సైతం అప్పటి కాంగ్రెస్ నాయకులపై నమోదు అయ్యాయని గుర్తు చేశారు. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో వివిధ పార్టీల నుంచి వలస నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారని, నేడు వారే అన్నిట్లో ముందుంటూ మేమే కాంగ్రెస్ పార్టీ నాయకులమని కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఎటువంటి పదవులు లేకున్నా అనధికారికంగా పదవులను సృష్టించుకొని కొనసాగుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ కాడి పట్టినోళ్లకు నేడు ఆదరణ కరువైందని ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలపై పీసీసీకి నివేదిక అందజేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోవర్ట్‌లకు ప్రస్తుతం ఉన్న నాయకులు వత్తాసు పలుకుతూ నెట్టుకొస్తున్నారని, నిజమైన కాంగ్రెస్ శ్రేణులకు మొండి చేయి చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీపై మట్టి చల్లిన వారే నేడు పార్టీలోకి వస్తూ నాయకులుగా చలామని అవుతున్నారని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డ వారికి కనీసం సమావేశాలలో సైతం కబురు అందించే వారే కరువయ్యారని, ప్రోటో కాల్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, నాయకుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రస్తుతం నాయకులు పని చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ సంఘటనలపై అదిష్టానం తక్షణమే స్పందించి నిక్కసమైన కాంగ్రెస్ వాధులను గుర్తించాలని, వారితో పార్టీ పునః నిర్మాణం దిశగా ఆలోచన చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో కొత్తగూడెం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం రాజశేఖర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్‌నాయక్, నాయకులు జయప్రకాశ్, ఉస్మాన్, ఏలూరు రాందాస్, మహిళ జిల్లా నాయకురాలు షబానా పాల్గొన్నారు.

## మల్లు నందిని పరామర్శ

చింతకాని, మే 15: మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన స్వతంత్ర్య సమరయోధుడు, టీడీపీ సీనియర్ నాయకులు అంబటి వెంకటయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన దశదిన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి సతీమణి మల్లు నందిని కార్యక్రమంలో పాల్గొని మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అంబటి వెంకటేశ్వర్లు, వడ్డే నారాయణరావు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మడిపల్లి భాస్కర్, దొబ్బల సౌజన్య, కిషోర్, గోవిందరావు, బందెల నాగార్జున పాల్గొన్నారు.

## అధ్యయనోత్సవాల ప్రారంభం

సత్తుపల్లి, మే15: సత్తుపల్లి పట్టణంలోని పాత సెంటర్‌లో ఉన్న కొత్తూరు వీరరాఘవయ్య, సావిత్రమ్మల గీతాజ్ఞానమందిరంలోని శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ పార్ధసారధి స్వామి దేవస్థానంలో అష్టాదశ (18వ) అధ్యయనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణం, అధ్యయనోత్సవ ప్రారంభం తొళ్లక్కం, ప్రబంధ సేవాకాలం, నివేదన, తీర్థప్రసాద గోష్టి తదితర పూజా కార్యక్రమాలు సాగాయి. 2006లో చిన్నజీయరు స్వామిచే ప్రతిష్ఠ గావించిన ఈ దేవాలయంలో ఈనెల 19వ తేదీ వరకు 5రోజుల పాటు ఆయా కార్యక్రమాలు, పూజలు సాగనున్నాయని, యావన్మంది భక్తులు విచ్చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని గీతామందిరం ట్రస్ట్ కోరింది.

## రేపటినుంచి తుంబూరులో బ్రహ్మోత్సవాలు

సత్తుపల్లి, మే 15: ఈనెల 17వ తేదీ నుంచి మండలంలోని తుంబూరులో ఉన్న లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో భూ సమేత లక్ష్మీ నృసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవం సాగనుంది. శ్రీమాన్ శ్రీ తిరునగరి పవన్‌కుమార్ ఆచార్యుల బ్రహ్మత్వంలో 5రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 17న గరుడ ప్రతిష్ఠ ధ్వజారోహణ, 18న సామూహిక కుంకుమ పూజలు, 19న శ్రీ లక్ష్మీ నారసింహ స్వామివారి మూలమంత్ర హోమం, భూ సమేత శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి కల్యాణం, అనంతరం నారాయణసేవ, 20న సుదర్శన లక్ష్మీ నారసింహ యజ్ఞం నిర్వహించనున్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు.. భీతిల్లుతున్న ప్రజలు

ఆళ్లపల్లి, మే 15: ఆళ్లపల్లి నుండి చింతోనిగుంపు ప్రధాన రోడ్డు మార్గంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు వాహనదారులకు ప్రమాదంగా మారాయి. ఆళ్లపల్లి నుంచి చింతోనిగుంపు మధ్యలోని ఓ ప్రైవేట్ వ్యక్తి 11కేవి విద్యుత్ అవసరం కోసం టీఎస్ఐపాస్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. దాంతో సంబంధిత నిర్వహకులు ఆళ్లపల్లి నుంచి విద్యుత్ స్థంబాలు వేశారు. వేసిన స్థంబాల్లో కొన్ని రోడ్డుకు దగ్గరగా వేయడంతో వాహనదారులు రెప్పపాటులో పక్కకు వెలితే స్థంబానికి ఢీ కొనే ప్రమాదం ఉందని వాహనదారులు వాపోయారు. రోడ్లపై పశువులను కట్టెయ్యడం, వాహనాలు నిలిపిస్తేనే హెచ్చరికలు జారీ చేసే పంచాయతి అధికారులు, రోడ్డు పక్కన ప్రమాదకరంగా వేస్తున్న స్థంబాల విషయంపై పట్టించుకోకపోవడంపై అనేక ఆరోపణలు చేస్తున్నారు. దాంతో పాటు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మలను సైతం తొలగిస్తుండగా, హరితహారంలో నాటిన చెట్ల కొమ్మలు సైతం నరికేందుకు సిద్దంగా ఉన్నారు. స్తంభాలు పెట్రోల్ బంక్ వెనుక నుంచి, పొలాల మార్గం గుండా వేస్తే ఎవరికీ ఏ ఇబ్బంది ఉండేది కాదని, ఇలా రోడ్డు పక్కనే వేయడం ఎప్పటికైనా ప్రమాదమేనని పలువురు అంటున్నారు. విద్యుత్‌శాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు విద్యుత్ స్తంభాలను దూరంగా వేసేందుకు చర్యలు తీసుకోవాలని వాహనాదారులు కోరుతున్నారు.


రహదారి పక్కనే ఉన్న స్తంభాలు

## డయాగ్నస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 15: ఖమ్మం జిల్లాలోని డయాగ్నస్టిక్ కేంద్రాలు రోగులను నిలువు దోపిడికి గురి చేస్తున్నాయని, నిబంధనలు పాటించని కేంద్రాలపై వైద్యఆరోగ్య శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో అశోక్ మాట్లాడారు. అనారోగ్యంతో వైద్యశాలలకు వచ్చిన రోగులను వైద్య నిర్ధారణ పరీక్షలతో వారిని మరింతగా డబ్బులు గుంజుతున్నారని ఆరోపించారు. అవసరం లేకున్నా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపట్టటంపై కలెక్టర్ వీపీ గౌతమ్ స్పందించాలని ఆయన కోరారు.